బంగారు తెలంగాణ సాధనకు కృషి



ఎమ్మెల్యేకు ఏకగ్రీవ తీర్మాన పత్రాలను అందజేస్తున్న పలు కాలనీల సంక్షేమ సంఘాలు

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి వివేకానంద్

కుత్బుల్లాపూర్: బంగారు తెలంగాణ సాధనకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని.. బీఆర్ఎస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 30వ కార్పొరేషన్ పరిధిలోని జర్నలిస్ట్ కాలనీలో కార్పొరేటర్ కొలన్ మీనాసునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మేయర్ కొలన్ నీలారెడ్డితో కలిసి ఎమ్మెల్యే వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన పలువురు యువకులు, మహిళలు బీఆర్ఎస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కోట్లాది నిధులతో చేపట్టిన అభివృద్ధిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

◆ **ఆక్సిజన్ పార్కులో వాకర్స్‌తో...**

గాజులరామారంలోని పాణవాయువు ఆక్సిజన్ పార్కులో ఎమ్మెల్యే వివేకానంద స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరిరావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాకర్లను, పార్కును సందర్శించిన ప్రజలను పలకరిస్తూ ఆక్సిజన్ పార్కు ఏర్పాటుకు తాము చేసిన కృషిని వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే మరింత అభివృద్ధిని చేపడతామన్నారు.

◆ **నియోజకవర్గ రాజకీయ పితామహుడు కేఎం పాండు వర్ధంతి**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ రాజకీయ పితామహుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ కేఎం పాండు 5వ వర్ధంతిని చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్ ఆధ్వర్యంలో పాండు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి కేఎం పాండు అని, ఆయన సేవలను ఈ ప్రాంత ప్రజలు ఎన్నటికి మరువరన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ కిషన్‌రావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ టి.లక్ష్మారెడ్డి, కృష్ణమూర్తి, బలరామ్‌రెడ్డి, సత్తిరెడ్డి, సురేందర్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



చింతల్ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన పలువురు

◆ **బీఆర్ఎస్‌లోకి బండ నరేందర్**

జగద్గిరిగుట్ట డివిజన్ షిరిడీహిల్స్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు బండ నరేందర్ తన అనుచరులతో కలిసి వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ వేణు యాదవ్, మాజీ వార్డు బండ మహేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే వివేకానంద్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మెట్ల శ్రీను, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎమ్మెల్యేకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మాన పత్రాలు**

గాజులరామారం డివిజన్ వొక్షిత్ ఎన్‌క్లేవ్, మెట్టు కనిగూడ, ఆదర్శ్ నగర్, హెచ్ఏఎల్ కాలనీ - నార్త్, మల్లారెడ్డి నగర్, ఐశ్వర్య ఎస్టేట్, ద్వారకా నగర్ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే వివేకానంద్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మాన పత్రాలు అందజేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ పర్ష శ్రీనివాస్‌యాదవ్, సంక్షేమ సంఘాల ప్రతినిధులు కృష్ణగౌడ్, సుబ్బారాయుడు, నాగభూషణం, అప్పల రాజు, ఏ. సత్యనారాయణ, రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

◆ **బీఆర్ఎస్‌లోకి పటేల్‌నగర్ బీజేపీ నాయకులు**

చింతల్ డివిజన్ వల్లభాయ్ పటేల్‌నగర్‌కు చెందిన బీజేపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, నర్సింహ యాదవ్, సునీల్, ప్రసాద్, సిద్దు, జిలానీ మిత్ర బృందం, అదే విధంగా రమేష్, రాజులు తమ అనుచర గణంలో కాలనీ ప్రెసిడెంట్ శేఖర్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు.



గాజులరామారం ఆక్సిజన్ పార్కులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే



కేఎం పాండు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నిజాంపేట్ జర్నలిస్ట్‌కాలనీలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నఎమ్మెల్యే

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



సూరారం ప్రధాన రోడ్డులో అర్ధరాత్రి వాహనాలను తనిఖీ చేపిస్తున్న అడిషనల్ డీసీపీ

సుభాష్‌నగర్: ఎన్నికల నేపథ్యంలో ప్రధాన రహదారిలో వెహికల్ చెకింగ్ పోలీసులు ముమ్మరంగా చేస్తున్నారు. సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రధాన రోడ్డుపై జరుగుతున్న వెహికల్ చెకింగ్‌ను మేడ్చల్ అడిషనల్ డీసీపీ ఇక్బాల్ సిద్దిఖ్, మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డితో కలిసి శనివారం అర్ధరాత్రి పరిశీలించారు. ఎన్నికల సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో తీసుకుంటున్న జాగ్రత్తగా విషయమై స్థానిక సీఐ వెంకటేశ్వరరావుని అడిగి తెలుసుకున్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

నిజాంపేట్: మద్యం బాటిళ్లు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వ్యక్తిని బాచుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సుమన్‌రావు తెలిపిన వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్‌కు చెందిన పురుషోత్తమ్ మద్యం బాటిళ్లను తరలిస్తుండగా ఆదివారం ప్రగతినగర్ కమాన్ వద్ద బాలానగర్ ఎస్ఓటీ పోలీసులకు పట్టుబడ్డాడు. అతని నుంచి 75 బాటిళ్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని తదుపరి విచారణకు బాచుపల్లి పోలీసులకు అప్పగించారు. నగరానికి నాలుగైదు రోజులకోసారి వస్తున్న పురుషోత్తమ్ ప్రతిసారి మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి వాటిని ప్రైవేట్ ట్రావెల్స్‌లో ఏపీకి తరలిస్తూ ఎక్కువ డబ్బులకు అమ్ముతున్నట్లు విచారణలో పేర్కొన్నట్లు సీఐ తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న అతనిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ, వైఎస్సార్ అభిమానుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఏపీ ఐటీ వింగ్ ప్రధాన కార్యదర్శి హరీష్‌రెడ్డి, దేశిరెడ్డి సురేష్‌రెడ్డి తదితరులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ, వైఎస్సార్ అభిమానుల సమావేశం ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు దేశిరెడ్డి సురేష్ రెడ్డి అధ్యక్షతన బహదూర్‌పల్లిలో జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణలో త్వరలో జరగబోకే ఎన్నికలలో ఎలా వ్యవహరించాలి.. పార్టీని తెలంగాణలో ఎలా ముందుకు తీసుకువెళ్లాలి.. అదే విధంగా డిసెంబర్‌లో జరిగే ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జనరల్ సెక్రటరీ మందపాటి హరీష్‌రెడ్డి, నాయకులు ఆర్కె, భాస్కర్ రెడ్డి, ఏవీరెడ్డి, దయాకర్‌రెడ్డి, నాయుడు, వంశి, ఏనుగుల భాస్కర్ రెడ్డి, చక్రధర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, చందు, సందీప్, మిథేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫాక్స్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు

జీడిమెట్ల: అధికారులు ఎలక్షన్‌లలో బిజీగా ఉండటంతో కబ్జాదారులు తమ పని తాము చకచక కానిచ్చేస్తున్నారు. ప్రభుత్వ జాగాలో పాగా వేసి తొందరగా రూములు కట్టిస్తున్నారు. తాజాగా ఫాక్స్‌సాగర్ ఎఫ్‌టీఎల్ జాగాలో కొంతమంది త్వరిగతిన గదుల నిర్మాణం చేపట్టారు. గతంలో ఇదే జాగాలో కొంతమంది నిర్మాణం చేపట్టగా విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే సదరు నిర్మాణాలను కూల్చివేశారు. మరలా అధికారులు ఎలక్షన్ పనుల్లో ఉంటారని భావించిన వ్యక్తులు సిమెంట్ ఇటుకలతో గదుల నిర్మాణం చేపట్టారు.

వెంటనే కూల్చివేయాలని స్థానికులు డిమాండ్.

నాలుగు రోజుల క్రితం సుభాష్‌నగర్‌లో ముగ్గురు వ్యక్తులు ఫాక్స్‌సాగర్ అలుగు కాలువను పూడ్చి పిల్లర్లతో నిర్మాణం చేపట్టగా అధికారులు వెంటనే కూలి్చవేశారు. తాజాగా ఏకంగా ఎఫ్‌టీఎల్ జాగాలో నిర్మాణం చేపట్టారు. వెంటనే గదుల నిర్మాణాలను అధికారులు అడ్డుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా అధికారులు ప్రభుత్వ స్థలాలపై ఓ కన్నేసీ ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.



ఫాక్స్‌సాగర్ ఎఫ్‌టీఎల్ జాగాలో చేపట్టిన నిర్మాణాలు

శ్మశానవాటికలోనే అక్రమ పార్కింగ్

చింతల్: చింతల్ శ్మశానవాటిక ప్రాంగణం అక్రమ పార్కింగ్‌లకు అడ్డంగా తయారయ్యింది. ఇప్పటికే రూ.90లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు నిలిచిపోగా అక్రమ పార్కింగ్‌లు సమస్యగా మారయి. కొంతమంది రాజకీయ నేతలు అండదండలతో వాహనాల యజమానులు నెలల తరబడి పార్కింగ్‌లు చేస్తుండడంతో దహన సంస్కారాలకు వచ్చే జనానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

◆ గతంలో ప్రధాన రోడ్లపై పార్కింగ్ చేస్తుండగా వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఈ వాహన యజమాని ప్రశ్నించడంతో ఇప్పుడు శ్మశానవాటికను అడ్డాగా చేసుకొని అక్రమ పార్కింగ్‌లు చేస్తున్నారు. గతంలో ఈ వాహనాలను శ్మశానవాటిక బయట, పక్కన నిలిపేవారు. ఇప్పుడు శ్మశానవాటిక లోపలే పార్కింగ్‌లు చేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.

◆ ఈ అక్రమ పార్కింగ్ చేసే వారికి శ్మశానవాటిక నిర్వాహకులు అనుకూలంగా మారి నెలవారీగా కిరాయిల సైతం వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు స్పందించి శ్మశానవాటికల్లో అక్రమంగా పార్కింగ్‌లు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అదే విధంగా రూ.90 లక్షలతో చేపట్టే వైకుంఠధామం నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చింతల్ శ్మశానవాటికలో నిలుపుతున్న వాహనాలు

బీజేపీలో చేరిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కూన శ్రీశైలంగౌడ్



మునీశ్వర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న కూన



కుత్బుల్లాపూర్ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్



భగత్‌సింగ్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని పలువురు పార్టీలో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం చింతల్ డివిజన్ పరిధి రంగానగర్, భగత్‌సింగ్‌నగర్‌లకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు ధరణిరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళా నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరగా వారికి శ్రీశైలంగౌడ్, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డిలు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ప్రస్తుత ఎమ్మెల్యే చేసిందేమీ లేదు..

ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ అవినీతి అరాచక పాలనతో ప్రజలు విసుగు చెందారన్నారు. చింతల్ డివిజన్‌ను అధికార పార్టీ విస్మరించిందని... స్థానికంగా అభివృద్ధికి నోచుకోకుండా అస్తవ్యస్తంగా తయారైందన్నారు. భగత్‌సింగ్‌నగర్‌లో నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను ఏళ్లు గడిచినా అందుబాటులోకి తీసుకు రావడంలేదని మండిపడ్డారు.

◆ గతంలో తాను ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధే తప్ప ప్రస్తుత ఎమ్మెల్యే చేసిందేమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తన విజయానికి కృషి చేయాలన్నారు. డివిజన్ అధ్యక్షుడు పత్తి సతీష్, కంటెస్టెడ్ కార్పొరేటర్ రాధిక సదానందం, నాయకులు జితేందర్‌రెడ్డి, రాజేష్ చారి, సాయిరామ్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, రఘు యాదవ్, హరి, సోమయ్య, నరసింహ, రజితరెడ్డి సీతారామయ్య, మధు యాదవ్ సుబ్రహ్మణ్యం, ఆదిత్య, రాంసాయి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి కాంగ్రెస్ నేత పాలుగంటి హన్మంతు..

◆ సూరారం డివిజన్ సంజయ్ గాంధీనగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పాలుగంటి హన్మంతు పెద్ద సంఖ్యలో తన అనుచరులతో కలిసి బీజేపీ నాయకురాలు సంగీతా పాత్ర ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. పాలుగంటి అరవింద్ ముదిరాజ్, ఆర్ కిషన్, కృష్ణమాచారి, రమణారెడ్డి, అశోక్, విశ్వనాథ్ భరత్, వరమ్మ, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్‌రెడ్డి, బావిగడ రవి, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పత్తి రఘుపతి, నాయకులు రాజేష్ మిశ్రా, కూన రఘుగౌడ్ తదితరులు ఉన్నారు.

'కూన'కు మద్దతుగా ఎంఎన్‌రెడ్డినగర్-1 తీర్మానం..

జీడిమెట్ల 132 డివిజన్ ఎంఎన్ రెడ్డినగర్-1 కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మునీశ్వర్ ఆధ్వర్యంలో కాలనీవాసులు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో శ్రీశైలంగౌడ్‌ను గెలిపించుకుంటామని తెలుపుతూ ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేశారు.

బీజేపీ జెండా ఎగిరేలా బీజేవైఎం నేతలు కృషి చేయాలి..

గాజులరామారంలోని బీజేపీ అసెంబ్లీ కార్యాలయంలో బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ సాయిరామ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ, బీజేవైఎం విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డితో కలిసి కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు. కుత్బుల్లాపూర్‌లో బీజేపీ జెండాను ఎగురవేసేలా బీజేవైఎం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు బావిగడ్డ రవి, ఒక్కంటి దయాకర్, వారాల మహేష్, ఆకుల విజయ్ సాయి, అఖిల్, వేణుగౌడ్, ఈశ్వర్‌రెడ్డి, సాయినాథ్, మణిగౌడ్, రాధిక, సాయికృష్ణరెడ్డి, అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేవైఎం అధ్యక్షుడు సాయికృష్ణరెడ్డి ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకుడు కమ్మెట మహేష్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు నిశ్కాంత్, బీఆర్ఎస్ యువ నాయకులు మంగళగిరి మురళీకృష్ణ, ఓంకార్, కమ్మెట వినయ్ కుమార్ లు కూన శ్రీశైలంగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో సన్నీ విజయ్ కుమార్, అశోక్ నాయక్, కొమిరి దినేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన రంగానగర్, భగత్‌సింగ్‌నగర్‌లకు చెందిన మహిళలు



కూన శ్రీశైలంగౌడ్‌కు చిత్రపటాన్ని బహూకరిస్తున్న బీజేపీ మహిళా నేతలు

ఐదేళ్ల పాప ప్రాణాలు నిలిపిన ఎస్ఎల్‌జీ వైద్యులు

నిజాంపేట్: బాచుపల్లికి చెందిన ఎస్ఎల్‌జీ వైద్యులు సంక్లిష్టమైన శస్త్ర చికిత్స ద్వారా ఓ ఐదేళ్ల పాప ప్రాణాలు కాపాడాలరు. పంజాబ్‌కు చెందిన ఐదేళ్ల పాప అనారోగ్య సమస్యతో తరచూ హిమోగ్లోబిన్ స్థాయి పడిపోవడంతో తరచూ రక్తం ఎక్కించాల్సి వచ్చేది. బాలికకు ప్లేట్లేట్లు సైతం 20-30వేలు మాత్రమే ఉండటంతో చిన్న గాయమైనా తీవ్ర రక్తస్రావం అయ్యేది. పలు ఆస్పత్రుల్లో చూపించినా పాప వయసు రీత్యా శస్త్ర చికిత్స చేయడానికి ముందుకు రాలేదు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు ఎస్ఎల్‌జీ వైద్యులను సంప్రదించడగా కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి కాలేయానికి రక్తం సరఫరా చేసే పోర్టల్ పెయిన్ బ్లాక్ అయిందని, ప్లీహం సైతం సైజు పెరిగిందని గుర్తించారు. బాలికకు పలు రకాల వైద్య పరీక్షలు చేసిన అనంతరం ప్లీహాన్ని పూర్తిగా తొలగించడానికి స్ప్లినెక్టమీ అనే శస్త్రచికిత్స చేశారు. ముందుగా కాలేయానికి రక్తం సరఫరా చేసే ప్రధాన రక్తనాళానికి చుట్టూ ఏర్పడిన కొల్లేటరల్ రక్తనాళాలను డిస్ కనెక్ట్ చేసి, తర్వాత ప్లీహాన్ని పూర్తిగా తొలగించామని డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. పాపకు ఇన్‌ఫెక్షన్‌లు రాకుండా ఉండేందుకు ముందుగానే టీకాలు ఇచ్చామని, ప్రతి ఐదేళ్లకోసారి టీకాల బూస్టర్ డోస్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్లీహాన్ని పూర్తిగా తీసేయడం వల్ల భవిష్యత్‌లో ఏవైనా ఇన్ఫెక్షన్లు వస్తే ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఏ మాత్రం జ్వరం వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలే తప్ప నిర్లక్ష్యం చేయకూడదని డాక్టర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు.



పాపతో డాక్టర్ పవన్‌కుమార్

పునాదులు తీసి.. పట్టించుకోకుండా వదిలేసి!



గాంధీనగర్ ప్రధాన రోడ్డులో గోతులు తీసి వదిలేసిన మహిళా భవన నిర్మాణ పనులు

రంగారెడ్డినగర్: డివిజన్ పరిధి గాంధీనగర్‌లో గతంలో ఉన్న కమిటీహాల్ శిథిలావస్థకు చేరడంతో దాని స్థానంలో కొత్తగా మహిళా భవనాన్ని నిర్మించడానికి ఆగస్టు నెలలో ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ శంకుస్థాపనలు చేశారు. అయితే పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ భవన నిర్మాణానికి పునాదులు తీసి ఆపై పనులు చేపట్టకుండా పత్తా లేకుండా పోయాడు. అయితే పునాదుల గోతులు లోతుగా ఉండటంతో స్థానికంగా ఉండే చిన్నారులు ఆడుకుంటూ ఎక్కడ గోతుల్లో పడతారోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అసలు గోతులు తీసి పనులు ఎందుకు ఆపేశారని సంబంధిత అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పకుండా దాట వేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మహిళా భవన నిర్మాణాన్ని త్వరితగిన చేపట్టి పూర్తి చేయాలని గాంధీనగర్ వాసులు కోరుతున్నారు.



మహిళా భవన నిర్మాణానికి వేసిన శిలాఫలకం

ఎలక్ట్రికల్ గోదాంలో అగ్నిప్రమాదం

జీడిమెట్ల: సూరారంలోని ఓ ఎలక్ట్రికల్ గోదాంలో మంటలు అంటుకున్నాయి. పోలీసులు, ఫైర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... సూరారం ప్రధాన రోడ్డులో రవిందర్ రెడ్డి అనే వ్యక్తి అరుందతి ట్రేడర్స్ పేరిట ఎలక్ట్రికల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం దుకాణం గ్రౌండ్ ఫ్లోర్ నుంచి పొగలు రావడాన్ని గ్రహించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న జీడిమెట్ల ఫైర్ సిబ్బంది పది నిమిషాల వ్యవధిలోనే మంటలను ఆర్పివేశారు. అగ్నిప్రమాదానికి కారణం దుకాణంలో విద్యుదాఘాతమే అని తెలిపారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

అదును చూసి కబ్జా చేస్తూ..!



గాజులరామారంలోని బంధం చెరువులో మట్టిని నింపుతున్న దృశ్యం

సుభాష్‌నగర్: ఓవైపు అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉండగా.. మరోవైపు కబ్జాదారులు తమ పనిని తాము కాని చేస్తున్నారు. గాజులరామారం గ్రామం నుంచి లాల్ సాహెబ్‌గూడాకు వెళ్లే ప్రధాన రోడ్డు అనుకొని ఉన్న బంధం చెరువును ప్రతిరోజు క్రమంగా పూడ్చి వేస్తున్నారు. ఇటీవల వర్షాలతో నిండుకుండలా ఉన్న బంధం చెరువును రోడ్డును ఆనుకొని ఉన్న స్థలంలో గత కొన్ని రోజులు గుట్టు చప్పుడు కాకుండా మట్టిని పోసి నింపుతున్నారు. ఇలా ఇప్పటికి సుమారు 300 గజాల స్థలంలో మట్టి పోసి నింపారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి చెరువు స్థలం కబ్జాకు గురికాక ముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సుచిత్రలో నటి హిమజ సందడి

కుత్బుల్లాపూర్: సుచిత్ర సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యూటీ హెయిర్ సెలూన్ నూతన బ్రాంచ్‌ను ఆదవారం నటి హిమజ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మేకప్ ఆర్టిస్ట్, సెలూన్ నిర్వాహకురాలు సరిత దండే మాట్లాడుతూ.. సరికొత్త హెయిర్ స్టైల్స్, ఇతర సెలూన్ సేవలు అందించనున్నామని తెలిపారు.



సెలూన్ నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న నటి హిమజ